పేరంటాలమ్మ హుండీ కానుకల ఆదాయం రూ.5.45 లక్షలు

రామవరప్పాడు: స్థానిక శ్రీ వెంకమ్మ పేరంటాలమ్మ ఆలయంలో హుండీ కానుకలను గురువారం లెక్కించగా రూ.5,45,007 ఆదాయం వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి పి.లోకేశ్వరి తెలిపారు. కార్యక్రమాన్ని దేవదాయ శాఖ అధికారి కె.వి అనురాధ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా లోకేశ్వరి మాట్లాడుతూ మూడు నెలలకు అమ్మవార్లకు భక్తులు సమర్పించిన కానుకలను లెక్కించగా ఈ ఆదాయం వచ్చిందన్నారు. కార్యక్రమంలో సాయి సేవాదళ్ సభ్యులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యోగిపై దాడికి ఖండన

విజయవాడరూరల్: అనంతపురం జిల్లా పుట్లూరు మండలం మడ్డిపల్లి గ్రామ సచివాలయ పరిధిలోని రైతు భరోసా కేంద్రంలో గ్రామ ఉద్యాన సహాయకుడు ఎస్.రవితేజపై రైతు దాడి చేయడాన్ని ఆంధ్రప్రదేశ్ రైతు భరోసా కేంద్రం ఉద్యోగుల సంక్షేమ సంఘం గురువారం ఒక ప్రకటనలో ఖండించింది. దాడి చేసిన రైతు పేరు నమోదు అయిన జాబితాలో ఉందన్నారు. కొన్ని సాంకేతిక సమస్యల కారణంగా ఆ రైతుకు పంట నష్టం నగదు జమ కాలేదని, అయితే ఉద్యోగిపై రైతు దాడి చేయడాన్ని రాష్ట్ర సంఘం అధ్యక్షుడు కె.విజయ మోహన్ ఖండించారు. ఉద్యోగిపై దాడి చేసిన రైతుపై నాన్ బెయిల్‌బుల్ కేసు నమోదు చేయాలన్నారు.

జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాల పరిశీలన

నున్న(విజయవాడరూరల్): గ్రామంలోని జగనన్న లేఅవుట్‌లో జరుగుతున్న ఇళ్ల నిర్మాణాల పనులను ఇన్‌చార్జి ఎంపీడీఓ బీవీ శేషగిరిరావు, ఏఈ రామకృష్ణారావు గురువారం పరిశీలించారు. నిర్మాణం పనులను లబ్ధిదారులు వేగం పెంచాలని అధికారులు సూచించారు. ఈ సందర్భంగా కొందరు లబ్ధిదారులు బిల్లులు రాలేదని చెప్పగా వాటిని నమోదు చేసి గృహనిర్మాణశాఖకు పంపుతామన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

పెనమలూరు: మండల కేంద్రమైన పెనమలూరు వంతెన వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి గాయపడ్డాడు. ఈ ఘటనపై పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. సీఐ కిషోర్‌బాబు కథనం మేరకు.. రైల్వేలో పని చేస్తున్న ఎస్.నాగశ్రీనివాస్‌రాజగోపాల్ బుధవారం బైక్ పై పెనమలూరు నుంచి బందరు రోడ్డు వైపు వెళ్తుండగా, వంతెన వద్ద ఎదురుగా వచ్చిన గుర్తు తెలియని వాహనం ఢీకొట్టి ఆగకుండా వెళ్లిపోయింది.





• గుడివాడ ముస్తాబు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాక సందర్భంగా గుడివాడ పట్టణం ముస్తాబైంది. టిడ్కో గృహాల్లో ప్రవేశాలు, ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమాన్ని శుక్రవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ప్రారంభించనున్నారు. ఇందుకోసం విస్తృత ఏర్పాట్లు చేశారు. జిల్లా కలెక్టర్ రాజాబాబు, ఎస్పీ జాషువా, ప్రజాప్రతినిధులు, అధికారులు ఏర్పాట్లను పరిశీలించారు. –గుడివాడ టౌన్

రెండున్నర దశాబ్ధాల సమస్యకు పరిష్కారం

ఎమ్మెల్యే డీఎన్నార్

కైకలూరు: రెండున్నర దశాబ్దాలుగా వరహాపట్నం శివారు బొల్లినంపాడు ప్రజలు ఎదుర్కొంటున్నా తాగునీటి సమస్యకు పరిష్కారం చూపామని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) అన్నారు. గ్రామంలో రూ.4 లక్షల మండల పరిషత్ నిధులతో పైపులైను పనులను ఎమ్మెల్యే గురువారం ప్రారంభించారు. ప్రజలకు తాగునీటిని అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా పర్యాటనకు వచ్చినప్పుడు గ్రామ ప్రజలు మైక్రోపిల్లర్, సీసీ రోడ్లు, కాలవగట్టు రేవు, ప్రతి ఇంటికీ కుళాయి కావాలని కోరారని గుర్తుచేశారు. గ్రామ సర్పంచ్ ఉప్పలపాటి నాగమణి పైపులైను ఏర్పాటు పనుల్లో కృషి చేశారని చెప్పారు. గ్రామంలో మరింత అభివృద్ధి పనులు చేపడతామన్నారు. ప్రజలందరూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ అడవి కృష్ణ, వైస్ ఎంపీపీ మహ్మద్ జహీర్, వైఎస్సార్ సీపీ మండల పార్టీ అధ్యక్షుడు భట్రాజు శివాజీ, సర్పంచ్‌ల ఫోరమ్ అధ్యక్షుడు చెరుకువాడ బలరామ రాజు, ఉప సర్పంచ్ గంగుల ఆంజనేయులు, ఎంపీటీసీ పందు గాంధీప్రసాద్, పీఏసీఎస్ చైర్మన్ కత్తుల రమేష్, జంపన రాము, మారగాని గణపతి, కౌనాల అనిత, ఉప్పలపాటి జయదేవ్ కుమార్, బోయిన శ్రీనివాసరావు, చిల్లిముంత రాజు, సోమయ్య, పడమటి సీతారాం, బోయిన శ్రీనివాసరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నాగబాబు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.


బొల్లినంపాడు అగ్రహారంలో నీటి కుళాయిలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డీఎన్నార్, నాయకులు

చెరువు పూడిక తీత పనులు ప్రారంభం

గన్నవరం: స్థానిక కోనాయి చెరువు పైలెట్ ప్రాజెక్ట్ పక్కనే ఉన్న తొండం గట్టు చెరువు పూడికతీత పనులకు గురువారం శ్రీకారం చుట్టారు. తొలుత చెరువు అభివృద్ధి పనులను ఎమ్మెల్యే డాక్టర్ వల్లభనేని వంశీ మోహన్ కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెరుగుతున్న గ్రామ జనాభా అవసరాలకు అనుగుణంగా తాగునీటి వనరులను మెరుగుపర్చుతున్నట్లు చెప్పారు. ఇప్పటికే 18 ఎకరాల విస్తీర్ణంలోని పానకాలు చెరువులో పూడికతీత పనులు చేపట్టినట్లు తెలిపారు. ప్రస్తుతం తొండం గట్టు, ఊర చెరువులో కూడా పూడికలు తీసి పోలవరం కాలువ నుంచి గోదావరి నీటితో నింపనున్నట్లు చెప్పారు. తద్వారా భూగర్భ జలాలు పెరగడంతో పాటు ఈ చెరువుల్లోని నీటిని తాగునీటి సరఫరాకు వినియోగించనున్నట్లు తెలిపారు. తొండం గట్టు చెరువులో పూడికతీసిన మట్టిని పరిసర గ్రామాల ప్రజలు మెరక పనులకు వినియోగించుకోవాలని కోరారు. ఏఎంసీ చైర్‌పర్సన్ రామిశెట్టి అంజనీకుమారి, ఎంపీపీ అనగాని రవి, జెడ్పీటీసీ అన్నవరపు ఎలిజబెత్‌రాణి, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు ఎండీ గౌసాని, వైస్ ఎంపీపీ కొమ్మురాజు సుధీర్, ఉప సర్పంచ్ పాలడుగు నాని, ఎంపీటీసీ సభ్యులు మద్దినేని వెంకటేశ్వరరావు, పడమట రంగారావు, ప్రభుత్వ ఆస్పత్రి కమిటీ చైర్మన్ మన్నే సుందరరావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్ష, కన్వీనర్లు పడమట సురేష్, పార్టీ నేతలు పాల్గొన్నారు.


చెరువు పూడికతీత పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వంశీ

చిన్నారులకు మెరుగైన విద్య అందించేందుకు కృషి

కంకిపాడు: చిన్నారులకు మెరుగైన విద్య అందించేందుకు కృషి చేస్తున్నామని ఐసీడీఎస్ సీడీపీఓ కె.బి. సుకన్య అన్నారు. పట్టణంలోని 8వ అంగన్‌వాడీ కేంద్రంలో పూర్వ ప్రాథమిక విద్య పూర్తి చేసుకున్న చిన్నారులకు విద్యార్హత ధ్రువీకరణ పత్రాలను గురువారం అందించారు. ప్రజలను భాగస్వామ్యం చేయటంపై అవగాహన కల్పించారు. కె.బి.సుకన్య మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆట పాటలతో కూడిన పూర్వ ప్రాథమిక విద్య అందుతుందన్నారు. విద్యతో పాటుతో పౌష్టికాహారాన్ని ప్రభుత్వం సమర్థంగా అందిస్తోందన్నారు. పౌష్టికాహార లోప నివారణకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. అంగన్‌వాడీ చిన్నారులు తయారు చేసిన వస్తువులను ప్రదర్శించారు. కార్యక్రమంలో కంకిపాడు ఉపసర్పంచ్ రాచూరి చిరంజీవి, వార్డుసభ్యులు వంకదారు చిట్టబ్బాయ్, చిట్టూరి కోటయ్య బాబు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు అన్నామణి, సత్య, సిబ్బంది వై.నళినీకుమారి, కోలవెన్ను భవాని, ఎం. రత్నకుమారి, డి.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


చిన్నారులకు పట్టాలు అందజేస్తున్న సీడీపీఓ సుకన్య తదితరులు

మండలంలో 440 మట్టి నమూనాల సేకరణ లక్ష్యం

విజయవాడరూరల్: విజయవాడ రూరల్ మండలంలో ఈ ఏడాది 440 మట్టి నమూనాలను సేకరించాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్ణయించిందని మండల వ్యవసాయాధికారి బి.రంగనాథ్‌బాబు ఒక ప్రకటనలో తెలియజేశారు. ప్రతి 5 ఎకరాలకు ఒక మట్టి నమూనా సేకరించాల్సి ఉంటుందన్నారు. ఈ నమూనాల విశ్లేషణ కోసం ల్యాబ్‌కు పంపి భూమిలో నత్రజని, భాస్వరం, పొటాష్, సేంద్రియ కర్బనం సమచారంతో రైతులకు కార్డుల ద్వారా తెలియజేస్తామన్నారు. ఈ వివరాలన్నీ కూడా ఎస్‌హెచ్‌సీ(సాయిల్ హెల్త్ కార్డ్) యాప్ ద్వారా జియో కో–ఆర్డినేట్స్ తో పాటు సేకరిస్తామన్నారు. నిడమానూరు గ్రామంలో గురువారం మట్టి నమూనా సేకరించామని, కార్యక్రమంలో సుంకర గోపాలకృష్ణ, గుండ్రెడ్డి శేషయ్య, వల్లూరు కోటేశ్వరరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


మట్టి నమూనాలు సేకరిస్తున్న అధికారులు

విద్యార్థుల ఉజ్వల భవితే ప్రభుత్వ ధ్యేయం

కంకిపాడు: విద్యార్థుల ఉజ్వల భవితే ప్రభుత్వ ధ్యేయమని జెడ్పీటీసీ సభ్యుడు బాకీబాబు అన్నారు. మండలంలోని ఈడుపుగల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జగనన్న ఆణిముత్యాలకు సత్కారం మండల స్థాయి కార్యక్రమం గురువారం జరిగింది. 2022–23 విద్యాసంవత్సరంలో పదో తరగతిలో ఉత్తమ ప్రతిభ చాటిన విద్యార్థులను ఘనంగా సత్కరించి, ప్రోత్సాహక బహుమతులు అందించారు. బాకీ బాబు మాట్లాడుతూ కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దిన ఘనత సీఎం జగన్‌కే దక్కిందన్నారు. నాణ్యతతో కూడిన విద్యను అందించేందుకు నూతన విద్యావిధానాలను ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మి మాట్లాడుతూ.. మన బడి నాడు–నేడు కింద పాఠశాలల్లో అన్ని మౌలిక వసతులను ప్రభుత్వం కల్పించిందన్నారు. విద్యా ప్రమాణాల పెంపుదలకు ఉపాధ్యాయులు సమర్థంగా పనిచేయాలన్నారు. ఎంఈఓ కనకమహాలక్ష్మి, ఎంపీటీసీ సభ్యులు బూరగ బాలాజీ, ఏఎంసీ వైస్ చైర్మన్ బిళ్లా వెంకటేశ్వరరావు, నెరుసు సతీష్, హెచ్‌ఎం పద్మావతి పాల్గొన్నారు.


విద్యార్థులను అభినందిస్తున్న బాకీ బాబు, రాజ్యలక్ష్మి తదితరులు

హత్యాయత్నం కేసులో నిందితుడి అరెస్టు

కంకిపాడు(పెనమలూరు): వివాహితపై హత్యాయత్నం కేసులో నిందితుడైన ఆమె భర్తను కంకిపాడు పోలీసులు గురువారం అరెస్టు చేసి కోర్టుకు హాజరుపరిచారు. ఎస్‌ఐ కె.సుధాకర్ కథనం మేరకు.. కంకిపాడు పట్టణానికి చెందిన సాలే శాంతి, చంటిబాబు భార్యాభర్తలు. కొద్దిరోజులుగా వారి మధ్య మనస్పర్థలు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఈ నెల 14వ తేదీన చంటిబాబు చాకుతో భార్య శాంతి పొట్టలో పొడిచాడు. బాధితురాలి ఫిర్యాదుతో చంటిబాబుపై హత్యాయత్నం, వేధింపుల కేసును పోలీసులు నమోదు చేశారు. నిందితుడిని అరెస్టు చేసి కోర్టుకు హాజరుపరిచామని ఎస్‌ఐ సుధాకర్ తెలిపారు.

క్లుప్తంగా

విద్యార్థులకు ఆటల పోటీలు



గుడివాడ టౌన్: స్థానిక ఏఎన్నార్ కళాశాలలో విద్యార్థులకు గురువారం ఇన్‌డోర్ గేమ్స్ పోటీలు నిర్వహించారు. కళాశాల పీడీ వీర్ల గోపీ ఆధ్వర్యంలో టేబుల్ టెన్నీస్, షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు జరిగాయి. కళాశాలకు చెందిన పి.శ్యామ్ టేబుల్‌టెన్నీస్‌లో, షటిల్ బ్యాడ్మింటన్‌లో ఎన్.నితీష్ కుమార్ విజేతలుగా నిలిచారు. కేంద్ర, రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో జీ–20 ప్రజా భాగస్వామి కార్యక్రమంలో భాగంగా ఈ పోటీలు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ పీజేఎస్ కుమార్ విజేతలకు బహుమతులు అందజేశారు.

ఉపాధి పనుల పరిశీలన

పెదమద్దాలి (పామర్రు): మండల పరిధిలోని పెదమద్దాలిలో ఉపాధి పనులను ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఏపీవో పాలురాజు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనులను కచ్చితమైన కొలతలతో ప్రమాణాలకు లోబడి చేయాలని అన్నారు. పంట బోదెలలోపూడికతీత పనులు సక్రమంగానిర్వహించాలని అన్నారు. పంటబోదెలలోని సాగునీరు దిగువ ప్రాంతాల సాగుకు చేరు విధంగా తగు విధమైన వాలుతో ఉండేలా చర్యలుతీసుకోవాలని అన్నారు. మండలంలోని 25 గ్రామాల్లో 4,870 మంది కూలీలు ఉపాధి పనుల్లో పాల్గొన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫీల్డు అసిస్టెంట్‌లు, మేట్లు, కూలీలు పాల్గొన్నారు.

పాతకక్షల నేపథ్యంలో మహిళపై దాడి

కైకలూరు: పాతకక్షల నేపథ్యంలో మహిళపై దాడి చేసిన ఘటనపై రూరల్ పోలీసు స్టేషన్‌లో గురువారం కేసు నమోదయింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం భుజబలపట్నం గ్రామానికి చెందిన నక్కపొయ్యి మరియమ్మను అదే ప్రాంతానికి చెందిన ఉచ్చుల రత్నరాజు కొట్టాడు. ఆమె ఫిర్యాదుపై రత్నరాజుపై ఏఎస్ఐ జోసెఫ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

శీతనపల్లిలో పరస్పర కేసుల నమోదు

కైకలూరు: వివాహిత అదృశ్యంపై శీతనపల్లి గ్రామంలో ఇరువర్గాలపై పరస్పర కేసులను పోలీసులు గురువారం నమోదు చేశారు. రూరల్ పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం .. శీతనపల్లి గ్రామానికి చెందిన గూట్ల శ్యాంబాబు కుమార్తె రమ్యకు భీమవరానికి చెందిన వ్యక్తితో వివాహమైంది. గ్రామానికి చెందిన కమతం మోజేష్, భీమవరంలో ఉంటున్న రమ్య ఇరువురు కనిపించడం లేదు. గ్రామంలోని ఎరిచర్ల చందుతో మోజేస్ స్నేహంగా ఉంటాడు. దీంతో రమ్య మేనమామలు చందును మోజేస్ ఆచూకి తెలపాలని కొట్టారు. చందు ఫిర్యాదుపై నూకపొయ్యి వీరన్నబాబుపై ఎస్సై గాయత్రి కేసు నమోదు చేశారు. అదే విధంగా మేనకోడలు రమ్య వివరాలు అడగడానికి వెళితే కుటుంబ సభ్యులందరూ తమను కొట్టారని నూకపొయ్యి గోపాలకృష్ణ ఫిర్యాదుపై చందు అతని కుటుంబ సభ్యులపై పరస్పర కేసులు నమోదు చేశారు.

మజ్జిగ పంపిణీ



గుడివాడ టౌన్: పట్టణంలో వివిధ స్వచ్ఛంద సంస్థలు, సామాజిక సంఘాలు, వ్యాపారులు బాటసారులకు గురువారం మజ్జిగ పంపిణీ చేశారు. శ్రీకృష్ణ యాదవ సేవాసంఘం ఆధ్వర్యంలో స్థానిక నెహ్రూచౌక్ సెంటర్‌లో ఉప్పల వెంకటేశ్వరరావు జ్ఞాపకార్థం మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో యలమర్తి శ్రీనివాసరావు, బొగ్గారపు తిరుపతయ్య, ఉప్పల రాజబాబు, పుట్టి హరికుమార్ తదితరులు పాల్గొన్నారు. వెలమ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మెయిన్ రోడ్‌లో నిర్వహిస్తున్న మజ్జిగ పంపిణీ కార్యక్రమం 32వ రోజు కొనసాగింది. ఈ కార్యక్రమంలో వెలమ సంక్షేమ సంఘం నాయకులు పాల్గొన్నారు.

దిశ యాప్‌పై అవగాహన



మోపిదేవి: దిశ యాప్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఎస్ఐ సీహెచ్ పద్మ అన్నారు. మోపిదేవి నుంచి పెదప్రోలు జాతీయ రహదారిలో వాహనదారులు, ప్రయాణికులకు దిశయాప్‌పై గురువారం అవగాహన కల్పించారు. గ్రామ సచివాలయాల మహిళా పోలీసులతో కలిసి ద్విచక్ర వాహనాలు, ఆటోలు, కార్లలో వెళ్లే ప్రయాణికులకు దిశ యాప్‌పై అవగాహన కల్పించడంతో పాటు వారి స్మార్ట్‌ఫోన్లలో దిశ యాప్‌ను డౌన్‌లోడ్ చేశారు.

పేదింటి పిల్లలకు ఉన్నత చదువులే లక్ష్యం

- ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్
- పామర్రు నియోజకవర్గంలో 9 మంది ఆణిముత్యాలకు ప్రోత్సాహకాలు అందజేత



నిమ్మకూరులో నగదు ప్రోత్సాహకాలు స్వీకరించిన విద్యార్థులతో ఎమ్మెల్యే అనిల్‌కుమార్

నిమ్మకూరు(పామర్రు): పేదింటి పిల్లలకు ఉన్నత చదువులు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను గ్లోబల్ సిటిజన్స్‌గా తీర్చి దిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ అన్నారు. మండలంలోని నిమ్మకూరు గ్రామంలోని ఏపీ గురుకుల కళాశాల ఆవరణంలో నియోజకవర్గస్థాయిలో పదో తరగతి, ఇంటర్మీడియెట్‌లలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు జగనన్న ఆణిముత్యాల పథకం ద్వారా అవార్డులను గురువారం ప్రధానం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ భవిష్యత్‌లో టెక్నాలజీ చదువులపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పదవి చేపట్టిన నాటి నుంచి విద్యా రంగంలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకు వచ్చారని అన్నారు. అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిషు మీడియం ప్రవేశ పెట్టామన్నారు. గత విద్యా సంవత్సరం 2022–23లో జరిగిన పదోతరగతిలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన వల్లూరి త్రివేణి, విశ్వనాథపల్లి ఛాందిని, మాదాసి ఈక్షిత, మిక్కిలి చరిష్మ, పామర్తి ధావల్య మేఘశ్రీలను సన్మానించి సర్టిఫికెట్లు నగదు బహుమతులు అందజేశారు. ఇంటర్మీడియెట్‌లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన డి.అంజిరెడ్డి, ఎస్.శివారెడ్డి, ఎం.తేజస్విని, కె.రాజబాబు ప్రోత్సాహక నగదును ఎమ్మెల్యే అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ దాసరి అశోక్‌కుమార్, జెడ్పీటీసీ కె.స్వరూపరాణి, వైస్.ఎంపీపీ ఆరేపల్లి శ్రీనివాసరావు, ఎంపీటీసీ తాడిశెట్టి శ్రీనివాసరావు, కోఆప్షన్ సభ్యుడు ఎండీ హస్మతుల్లా, విజయవాడ కృష్ణామిల్క్ యూనియన్ జిల్లా ట్రస్టు బోర్డు సభ్యులు బొమ్మారెడ్డి కృష్ణారెడ్డి, మండల ఆర్‌బీకే అధ్యక్షుడు ఏ శ్రీనాథ్‌రెడ్డి, ఎంపీడీవో వై.రామకృష్ణ, పామర్రు ఎంఈవో పి.విజయలక్ష్మి, నిమ్మకూరు గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ పి.రవిబాబు, గురుకుల పాఠశాల, కళాశాలల అధ్యాపకులు, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.



బహుమతులు సాధించిన విద్యార్థులతో అధికారులు, నాయకులు

గుడివాడ టౌన్: పదో తరగతి పరీక్షల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలను సాధించిన ప్రతిభావంతులైన విద్యార్థులకు ప్రభుత్వ నగదు ప్రోత్సాహకాలను గురువారం పంపిణీ చేశారు. ఇంటర్మీడియట్‌లో ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించిన రుద్రపాక జూనియర్ కళాశాల విద్యార్థులకు రూ.15 వేలు చొప్పున నగదు బహుమతులు అందజేశారు. పదో తరగతిలో 579 మార్కులతో ప్రథమ స్థానం సాధించిన అక్షయకు రూ.15 వేలు, 577 మార్కులతో ద్వితీయ స్థానం సాధించిన ఎస్.లక్ష్మీప్రసన్నకు రూ.10 వేలు, తృతీయ స్థానం సాధించిన బి మహేష్, పి.యశస్విని, వి నయనాచౌదరి, షేక్ షబానాబేగం లకు ఒక్కొక్కరికి రూ.5 వేలు నగదు బహుమతులతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ శేఖర్‌సింగ్, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు దుక్కిపాటి శశిభూషణ్, మండలి హనుమంతరావు, ఎంపీ నారాయణరెడ్డి, రూరల్ ఎంపీపీ గద్దె పెప్పరాణి, జెడ్పీటీసీ జి.రామకృష్ణ, మున్సిపల్ మాజీ కౌన్సిలర్ మాదాసు వెంకట లక్ష్మి, ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పాడి రైతులకు ప్రోత్సాహకాలు

ముదినేపల్లి రూరల్ : పాల ఉత్పత్తిదారుల సంక్షేమానికి కృష్ణా మిల్క్ యూనియన్ పలురకాల ప్రోత్సాహకాలను అందిస్తున్నట్టు యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు అన్నారు. మండలంలోని పెదగొన్నూరు, కోమర్రు గ్రామాల్లోని పాల ఉత్పత్తిదారుల సంఘాల సభ్యులతో గురువారం సమావేశాలు నిర్వహించి బోనస్‌లు అందజేశారు. సంఘం సభ్యులైన పాడిరైతులకు ప్రతి నాలుగు నెలలకు 10 శాతం చొప్పున బోనస్ ధర అందజేస్తున్నట్టు చలసాని చెప్పారు. క్షీరబంధు, కల్యాణమస్తు, ప్రతిభ వంటి పథకాలతో పాటు పశువులకు ఉచితంగా వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. సబ్సిడీపై 20 శాతం ప్రొటీన్ గల పశుదాణా అందజేస్తున్నామని, కృత్రిమ గర్భ ఉత్పత్తి సేవలు అందజేస్తున్నామని చెప్పారు. సమావేశంలో గుడ్లవల్లేరు, పాలశీతలీకరణ మేనేజర్ తోట సత్యనారాయణ, సంఘాల అధ్యక్షుడు బత్తుల రవికృష్ణ, దారపురెడ్డి సాంబశివరావు, కార్యదర్శులు విశ్వనాథ్, వెంకటేశ్వరరావు, సూపర్‌వైజర్ గోపీకృష్ణ పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న ఆంజనేయులు

నేరస్తులకు పీడీ యాక్ట్‌తో చెక్ పెడతాం

టూటౌన్ సీఐ తులసీధర్



నిందితుడిని జైలుకు తరలిస్తున్న టూటౌన్ సీఐ తులసీధర్, సిబ్బంది

గుడివాడరూరల్: కరుడు కట్టిన నేరస్తులకు పీడీయాక్ట్‌తో చెక్ పెడతామని గుడివాడ టూటౌన్ సీఐ బి.తులసీధర్ పేర్కొన్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ జిల్లా ఎస్పీ జాషువా, గుడివాడ డీఎస్పీ శ్రీకాంత్ ఆదేశాల మేరకు జిల్లాలో నిషేధిత మాదకద్రవ్యాలు, గంజాయి విక్రయాలు, రవాణకు పాల్పడుతున్న రౌడీషీటర్ గుడవర్తి కిరణ్ ఆలియాస్ ఎఫ్రేల్ (27)ను అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేసి రాజమండ్రి జైలుకు తరలించామన్నారు. గుడివాడ సబ్ డివిజన్‌లోని పలు పోలీస్ స్టేషన్లలో గంజాయి, ఇతర మాదక ద్రవ్యాల విక్రయాలు, రవాణాలపై 12 కేసులు నమోదు చేశామని, ఎన్నిసార్లు పోలీసులు హెచ్చరించినప్పటికీ కిరణ్ ప్రవర్తనలో మార్పు రాలేదన్నారు. గంజాయిని విక్రయిస్తూ యువత జీవితాలతో ఆడుకోవడమే కాక మరిన్ని నేరాలకు పాల్పడుతుండటంతో జిల్లా ఎస్పీ పి.జాషువా ఆదేశాల మేరకు ప్రజారోగ్యాలతో వ్యాపారాలు చేస్తూ సొమ్ము చేసుకుంటున్న నిందితుడు కిరణ్‌కు సంబంధించిన నేరాల నివేదికను తయారు చేసి జిల్లా కలెక్టర్‌కు పంపామన్నారు. ఆ నివేదికను పరిశీలించి నిజమని నిర్ధారించి నిందితుడు కిరణ్‌పై పీడీయాక్ట్ అమలు పరుస్తూ జిల్లా కలెక్టర్ రాజబాబు ఉత్తర్వులు జారీ చేశారని వివరించారు. కలెక్టర్ ఉత్తర్వుల మేరకు నిందితుడిని రాజమండ్రి సెంట్రల్ జైలుకు తరలిస్తున్నామన్నారు. ఇతనిపై గుడివాడ వన్‌టౌన్, పెదపారుపూడి, గుడ్లవల్లేరు, హనుమాన్ జంక్షన్, నందివాడ పోలీస్ స్టేషన్లలో పలు కేసులు నమోదయ్యాయని వివరించారు. ఇటువంటి అక్రమాలకు పాల్పడే వారికి కూడా ఇలాంటి కఠిన చర్యలు తప్పవని సీఐ హెచ్చరించారు.

వంతెన నిర్మాణ పనుల పరిశీలన

కైకలూరు: స్థానిక ఎస్టీ కాలనీ సమీపంలో కాలిబాట వంతెన నిర్మాణ పనులను ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి గురువారం పరిశీలించారు. నాణ్యత ప్రమాణాలతో నిర్మాణం పూర్తిచేయాలని సూచించారు. అనంతరం సమీపంలోని ఎస్టీ కాలనీ కమ్యూనిటీ హాలును పరిశీలించారు. పంచాయతీరాజ్ డీఈఈ సురేష్ మాట్లాడుతూ మండల పరిషత్ నిధులు రూ.4 లక్షలతో వంతెన నిర్మిస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ అడివి కృష్ణ, తోట మహేష్, జక్కా శివాజీ, కరేటి రాంబాబు, బి.మంగారావు పాల్గొన్నారు.



కైకలూరులో వంతెన నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే డీఎన్నార్, నాయకులు

రైతుల సమస్యలపై పోరాడిన గొర్రెపాటి

ఘంటసాల(అవనిగడ్డ): స్వాతంత్ర్య సమరయోధుడు, కిసాన్‌నేత దివంగత గొర్రెపాటి వెంకట సుబ్బయ్య జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఘంటసాల పంచాయతీ కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో బుద్ధప్రసాద్ గొర్రెపాటి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ రైతుల సమస్యలపై గొర్రెపాటి పోరాడారని కొనియాడారు. ఈ సందర్భంగా కృషి విజ్ఞాన కేంద్రం, వ్యవసాయ పరిశోధన స్థానం పరిధిలోని 14 మంది అభ్యుదయ రైతులను ఘనంగా సత్కరించారు.

ఉపాధి పనుల్లో క్షేత్ర స్థాయి తనిఖీలు

కోసూరువారిపాలెం(మోపిదేవి): కోసూరువారిపాలెంలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో చేపట్టిన వివిధ పనులపై క్షేత్రస్థాయిలో సామాజిక తనిఖీలు నిర్వహించారు. సర్పంచ్ కోసూరు అనూష అధ్యక్షతన గురువారం జరిగిన కార్యక్రమంలో డీఆర్‌పీ జి.పూర్ణబాబు మాట్లాడుతూ 2022 ఏప్రిల్ ఒకటి నుంచి 2023 మార్చి 31 మధ్య కాలంలో గ్రామ పంచాయతీ పరిధిలో జరిగిన వివిధ పనులపై మూడు రోజుల పాటు క్షేత్ర స్థాయిలో సిబ్బంది తనిఖీలు చేసిందని పనుల వివరాలు చదివి వినిపించారు. ఎంపీటీసీ సభ్యుడు సనకా వెంకట రాజేష్‌బాబు, ఎస్ఆర్పీ టి. నందిని, గ్రామ పంచాయతీ కార్యదర్శి ఉప్పాల వెంకటేశ్వరరావు, ఎన్ఆర్‌ఈజీఎస్ సూపర్‌వైజర్ మజ్ను పాల్గొన్నారు.

సముద్రంలో గల్లంతైన యువకుడు మృతి

కోనేరుసెంటర్(మచిలీపట్నం): సముద్రంలో గల్లంతైన యువకుడు మృతి చెందాడు. అతని మృతదేహాన్ని బంటుమిల్లి మండలం ఇంతేరు గ్రామ సమీపంలో పోలీసులు గుర్తించారు. బందరు మండలం గోపువానిపాలెం గ్రామానికి చెందిన మేరుగు హేమంత్ (25) ఆటోడ్రైవర్‌గా జీవిస్తున్నాడు. గత ఆదివారం స్నేహితులతో కలిసి మంగినపూడి బీచ్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను చూసేందుకు వెళ్లాడు. స్నేహితులతో కలిసి సరదాగా సెల్ఫీ దిగుతున్న సమయంలో హేమంత్ ప్రమాదవశాత్తు సముద్రంలో పడిపోయాడు. అతడి కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టినా ప్రయోజనం లేకపోయింది. ఐదు రోజుల తర్వాత గురువారం హేమంత్ మృతదేహం ఇంతేరు సమీపంలోని సముద్రపు ఒడ్డు కు కొట్టుకు వచ్చింది. విషయం తెలుసుకున్న పోలీ సులు పోస్టుమార్టం నిమిత్తం హేమంత్ మృతదేహా న్ని మచిలీపట్నం సర్వజన ఆస్పత్రికి తరలించారు.

ఉపాధ్యాయులకు సత్కారం

ముదినేపల్లి రూరల్ : మండలంలోని వడాలి జెడ్పీహైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు బీఎస్ నాగేశ్వరరావు గుడివాడ రూరల్ మండలం బిల్లపాడు హైస్కూల్‌కు బదిలీ అయ్యారు. వడాలి హైస్కూల్‌కు ముదినేపల్లి నుంచి వి.ప్రభుదాస్ బదిలీపై వచ్చారు. వీరిద్దరినీ గురువారం సీనియర్ ఉపాధ్యాయుడు సీహెచ్ నాగమల్లేశ్వరరావు ఆధ్వర్యంలో సన్మానించారు. ఉపాధ్యాయులు బీఎస్ ప్రకాశరావు, వి.శారద దేవీ, అనురాధ, వాసవి, స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ చైర్మన్ పల్లి ఉమామహేశ్వరరి, సురేష్, పలువురు ఉపాధ్యాయులు సిబ్బంది పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం



నాగాయలంక: స్థానిక శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవస్థానం ప్రాంగణంలో నిత్యాన్నదాన కమిటీ ఆధ్వర్యంలో గురువారం దాతల సహకారంతో 60 మంది నిరుపేద వృద్ధులు, దివ్యాంగులకు అన్నదానం చేశారు. గ్రామస్తులు ఉప్పల వెంకటేశ్వరరావు, రుక్మిణాంబ దంపతులు ఆర్థిక సాయం అందించారు.

ఇంటర్ అడ్వాన్స్‌డ్‌లో విద్యార్థుల ప్రతిభ



పెడన: పట్టణంలోని బొడ్డు నాగయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రథమ సంవత్సరం చదువుతూ పలువురు అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు హాజరై అత్యధిక మార్కులు సాధించారని కళాశాల ప్రిన్సిపాల్ చంద్రశేఖర రామారావు అన్నారు. ఎంపీసీలో పేరక సాయి 470 మార్కులకు 452 మార్కులు సాధించిందన్నారు. గుడిమెట్ల రామ్‌కార్తీక్‌కు 437 మార్కులు వచ్చాయన్నారు. బైపీసీలో 440 మార్కులకుగాను వాసా ఝాన్సీ 285, సీఈసీలో షేక్ మయిమున్నీసా 500 మార్కులకు 362 మార్కులు వచ్చాయని చెప్పారు. వృత్తి విద్యా కోర్సులలో ఓఏస్‌లో మధురేఖ 500లకు 457 మార్కులు సాధించారని తెలిపారు. అత్యధిక మార్కులు వచ్చిన విద్యార్థులను గురువారం అభినందించి ప్రైజ్‌లను అందజేశారు. అధ్యాపకులు పేరిశెట్టి నాగరవి, సైదా, శ్రీనుబాబు, నిరంజన్, గంగాధర్, ఆనందరావు, గిరి, రవికుమార్ పాల్గొన్నారు.

వరి విత్తనాల షాపులు తనిఖీ



ఘంటసాల(అవనిగడ్డ): 2023 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి రైతులకు మేలైన విత్తనాలు సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఘంటసాల ఏఓ కె. మురళీకృష్ణ తెలిపారు. ఘంటసాల మండలంలోని పలు విత్తనాల షాపు లను బుధవారం ఆయన తనిఖీ చేశారు. కోరమాండల్ షాపులోని వరి విత్తనాలు, లైసెన్స్, సరఫరా రశీదులు, నాణ్యతా ప్రమాణాలు, బిల్ పుస్తకాలు, ధరలు, నిల్వలను ఆయన పరిశీలించారు. ఏఓ మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదే శాల మేరకు విత్తనాల షాపులను తనిఖీ చేశా మని చెప్పారు. ఎమ్మార్పీ కంటే ఎక్కువకు అమ్మినా, రశీదులు ఇవ్వక పోయినా, నిబంధనలు పాటించక పోయినా చట్టపరంగా చర్య లు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులు తప్పనిసరిగా రశీదులు తీసుకోవాలన్నారు.

ఇళ్ల పట్టాల పంపిణీ



పట్టాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

గుడివాడ టౌన్: పట్టణంలో జగనన్న కాలనీలో ఇళ్ల పట్టాలను గురువారం పంపిణీ చేశారు. పలు వార్డు సచివాలయాల కార్యాలయాల్లో ఈ పంపిణీ జరిగింది. ప్రస్తుతం మల్లాయిపాలెం లే-అవుట్‌లో ఉన్న జగనన్న కాలనీలో మిగిలి ఉన్న 30 ఎకరాల భూమిలో కొంత పేదలకు ఇళ్లస్థలాలుగా ఇవ్వాలని నిర్ణయించారు. ఈ నేపథ్యంలో పట్టణంలోని 36 వార్డులకు చెందిన 1620 మంది లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు మంజూరైనట్లు అధికారులు తెలిపారు. వార్డుల వారీగా పంపిణీ చేశారు. స్థానిక 35వ వార్డులో వైఎస్సార్ సీపీ నాయకులు ఎంవీ నారాయణరెడ్డి 53, 11వ వార్డులో వార్డు ఇన్‌చార్జ్ షేక్ మౌలాలి, వైఎస్సార్ సీపీ మైనార్టీ సెల్ అధ్యక్షుడు షేక్ బాజి, సచివాలయ కన్వీనర్ ఎస్.జగదీష్ 130 ఇళ్లపట్టాలు, 6వ వార్డులో వార్డు ఇన్‌చార్జ్ వెంపల అప్పారావు 33 ఇళ్లపట్టాలు పంపిణీ చేశారు. స్థానిక 18వ వార్డులో ఇన్‌చార్జ్ అల్లం రామ్మోహన్, మాజీ కౌన్సిలర్ అల్లం సూర్యప్రభ 12 ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు.

కాలువల్లో గుర్రపుడెక్క తొలగింపు చర్యలు



కెమికల్ స్ప్రేచేస్తున్న కార్మికులు

గుడివాడ టౌన్(నందివాడ): నందివాడ మండలంలో పంటకాల్వల ప్రక్షాళనకు రంగం సిద్ధం చేశారు. నందివాడ మండలం జనార్ధనపురం రెగ్యులేటర్ నుంచి దోసపాడు చానల్, మెహర్ బ్రాంచ్ చానల్ లలో పేరుకుపోయిన గుర్రపుడెక్క, తూటికాడ తొలగింపునకు చర్యలు చేపట్టారు. తొలివిడత గుర్రపుడెక్క చనిపోవడానికి కెమికల్ స్ప్రే చేశామని ఏఈ ఎస్.పవన్‌కుమార్ తెలిపారు. దోసపాడు చానల్ శివారు ప్రాంతం లక్ష్మీనరసింహపురం వరకు ఈ కార్యక్రమం కొనసాగు తుందన్నారు. త్వరలో వ్యవసాయ పనులు నిమిత్తం సాగునీరు విడుదల చెయ్యనున్న నేపథ్యంలో నీటి ప్రవాహానికి అడ్డంకులు తొలగిస్తున్నామన్నారు.

అగ్ని ప్రమాదంలో రెండు ఇళ్లు దగ్ధం

చినముత్తేవి (మొవ్వ): మొవ్వ మండలం చినముత్తేవిలో గురువారం జరిగిన అగ్ని ప్రమాదంలో తాటాకు ఇల్లు, ఓ రేకుల షెడ్డు అగ్ని ప్రమాదానికి గురయ్యాయి. మొవ్వ ఫైర్ అధికారి కే వెంకటేశ్వరరావు తెలిపిన వివరాల మేరకు గారపాటి పండు బాబుకు చెందిన పూరింట్లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగాయి. ఈ మంటలు పక్కనే ఉన్న గారపాటి వెంకట స్వామి రేకుల షెడ్డు ఇంటికి వ్యాపించాయని వెల్లడించారు. ఈ ప్రమాదంలో పండు బాబుకు రూ.60 వేల ఆస్తినష్టం వాటిల్లగా వెంకటస్వామికి రూ.50 వేల వరకు ఆస్తి నష్టం వాటిల్లినట్లు ఫైర్ అధికారి వివరించారు.

వరిగడ్డి లోడు లారీ దగ్ధం

గుడ్లవల్లేరు: గుడ్లవల్లేరులో కరెంట్ తీగలు తగిలి గడ్డి లారీ దగ్ధమైంది. స్థానిక వైఎస్సార్ బ్రిడ్జి ఎంఎన్‌కే రహదారి మీదుగా కౌతవరం నుంచి గుడివాడ వైపునకు వెళ్తున్న వరిగడ్డిలోడు లారీకి గురువారం రాత్రి కరెంట్ తీగలు తగలటంతో నిప్పులు చెలరేగి మంటలు వచ్చాయి. మంటలతో కూడిన లారీ ప్రధాన సెంటర్‌లో వెళ్తుంటే ప్రజలంతా భయభ్రాంతులకు గురయ్యారు. లారీ డ్రైవర్ చాకచక్యంగా ఊరి బయటకు మంటలు చెలరేగుతున్న లారీ తీసుకెళ్లాడు. ఎలాంటి ప్రాణ నష్టం లేకుండా చర్యలు తీసుకోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.



దగ్ధమవుతున్న గడ్డి లారీ

విద్యావంతులైన యువత దేశానికి అవసరం



విజేతలైన విద్యార్థులతో నిర్వాహకులు

డీఎస్పీ శ్రీకాంత్

గుడివాడ టౌన్: దేశానికి విద్యావంతులైన యువత ఎంతో అవసరమని డీఎస్పీ పి.శ్రీకాంత్ అన్నారు. కేంద్ర యువజన వ్యవహారాలు, విజయవాడ నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో గురువారం స్థానిక వీకేఆర్, వీఎన్‌బీ అండ్ ఏజీకే ఇంజినీరింగ్ కళాశాలలో ‘యువ ఉత్సవ్ ఇండియా–2047’ కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులకు ఫొటోగ్రఫీ, బృంద నృత్యం పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథి డీఎస్పీ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ట్రైబల్ వెల్ఫేర్ జిల్లా అధికారి ఫణి దూర్జటి, కళాశాల ప్రిన్సిపాల్ ఎస్‌హెచ్‌వీ ప్రసాదు, సెంట్రల్ బోర్డ్ ఆఫ్ కమ్యూనికేషన్స్ పబ్లిసిటీఅధికారి రమేష్‌చంద్ర, నెహ్రూ యువకేంద్రం జిల్లా అధికారి సుంకర రాము, డైరక్టర్ విజయభారతి, తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

బెల్ జీఎం జితేంద్ర సింగ్



రక్తదానం చేసిన ఉద్యోగిని అభినందిస్తున్న జీఎం జితేంద్ర సింగ్

మచిలీపట్నంటౌన్: రక్తదానం ప్రాణదానంతో సమానమని, ప్రతి ఒక్కరూ రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ (బెల్) జనరల్ మేనేజర్ జితేంద్రసింగ్ అన్నారు. స్థానిక బెల్ కంపెనీ ఆవరణలో గురువారం ఉద్యోగులు, అధికారులు, సిబ్బంది సుమారు 90 మంది రక్తదానం చేశారు. జిల్లా సర్వజన ఆస్పత్రి బ్లడ్‌బ్యాంక్ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని జీఎం ప్రారంభించి మాట్లాడారు. రక్తదానంతో ప్రాణాలు నిలుపుతూ జీవితాన్ని ప్రసాదించే భాగ్యం రక్తదాతలకు దక్కుతుందన్నారు. రక్తదానం చేయడాన్ని సామాజిక బాధ్యతగా భావించాలని చెప్పారు. రక్తదానం చేసిన బెల్ సిబ్బంది, ఉద్యోగులను అభినందించారు. సర్వజన ఆస్పత్రి బ్లడ్‌బ్యాంక్ అధికారులు గీతావాణి, రాయపరెడ్డి, సునీత, హిమబిందు, రెడ్‌క్రాస్ ప్రతినిధులు డాక్టర్ హనుమంతయ్య, బాలాజీ, రాం బాలాజీ, హనుమాన్ బాలాజీ, శంకర్‌నాథ్ తదితరులు పాల్గొన్నారు.

భూసార పరీక్షలతో అధిక దిగుబడులు

ఉంగుటూరు: భూసార పరీక్షలతో భూమిలోని పోషకాల లేమిని తెలుసుకుని, వాటికి అనుగుణంగా సాగు చేస్తే అధిక దిగుబడులు పొందొచ్చని వ్యవసాయశాఖ అధికారి వి.హరీష్‌కుమార్ తెలిపారు. మండలంలో జరుగుతున్న మట్టి నమూనా సేకరణను ఏఓ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో గ్రామ వ్యవసాయ సహాయకులు రైతుల పొలాల్లో మట్టి నమూనాలు సేకరించి ఆర్బీకేలో వివరాలను నమోదు చేస్తున్నారని చెప్పారు. మట్టిని ల్యాబ్‌లో పరీక్షించిన తరువాత నేరుగా రైతు ఫోన్‌లోకి వివరాలు పంపడంతోపాటు సాయిల్ హెల్త్ కార్డులు అందజేస్తారని వివరించారు. మట్టి పరీక్షల ఫలితాల అనుగుణంగా పోషకాలను అందజేయడం వలన రసాయన ఎరువుల ఖర్చులు తగ్గి అధిక పంట దిగుబడులు వస్తాయన్నారు. రైతులు పొలాల్లో మట్టి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఆర్బీకేలో గ్రామ వ్యవసాయ సహాయకులు అందుబాటులో ఉంటారన్నారు. కార్యక్రమంలో ఏఈఓ దుర్గానాగేశ్వరరావు, వీఏఏలు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సామూహిక కుంకుమ పూజలు



కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు

కోడూరు: మాచవరం గ్రామంలో సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో సామూహిక కుంకుమ పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గ్రామంలోని రామాలయం వద్ద గురువారం ప్రత్యేక కార్యక్రమాలు జరిగాయి. సీతారామచంద్రస్వామి వార్లకు పూజలు చేసి, ప్రత్యేక అలంకారంలో తీర్చిదిద్దారు. అనంతరం వేద పండితుల మంత్రోచ్ఛరణల నడుమ మహిళలు కుంకుమ పూజలు చేశారు. టీటీడీ ధర్మప్రచార జిల్లా సభ్యుడు ఆళ్ల జయశంకర్, సబ్ డివిజన్ కన్వీనర్ ఎస్.సుబ్బారావు, మండల కన్వీనర్ వెంకటేశ్వరరావు, మహిళా కన్వీనర్ అప్పికట్ల నాంచారమ్మ పాల్గొన్నారు.

ఉద్యోగావకాశాలు దక్కేలా ప్రభుత్వ చర్యలు



కళాశాల ఎడ్యుకేషన్ కమిషనర్ డాక్టర్ పోలా భాస్కర్


మొవ్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు సూచనలిస్తున్న డాక్టర్ పోలా భాస్కర్

మొవ్వ: రాష్ట్ర ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చదివిన ప్రతి విద్యార్థి నూటికి నూరు శాతం ఉద్యోగ అవకాశాలు కల్పించే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టిందని కళాశాల ఎడ్యుకేషన్ కమిషనర్ డాక్టర్ పోలా భాస్కర్ పేర్కొన్నారు. గురువారం మొవ్వ గ్రామంలోని వేమూరి సుందర రామయ్య ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలో జరిగిన కాలేజియేట్ ఎడ్యుకేషన్ జాబ్ ప్రొర్టల్ (సీఈజేపీ)పై జరిగిన ఓరియంటేషన్ ప్రొగ్రామ్ ఆయన పాల్గొన్నారు. విద్యార్థులకు పలు సూచనలు అందచేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 166 ప్రభుత్వ కళాశాలల్లో డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతున్న సుమారు 30 వేల మంది విద్యార్థులు తప్పని సరిగా సీఈజేపీ సైట్‌లో ఎన్రోల్ చేసుకోవాలని సూచించారు. 14కు పైగా ఎంఎన్‌సీ జాబ్ ప్రొవైడర్స్‌తో, స్కిల్ డవలప్‌మెంట్ ఆర్గనైజేషన్స్‌తో లింకప్ చేసుకున్నామని ఈ సందర్భంగా వివరించారు. విద్యార్థులకు ఎఎసెస్‌మెంట్ మోనటరింగ్ యాప్, ఇంటర్ షిప్, ఆన్‌లైన్ ఫీ, గ్రూవెన్స్, కమ్యూనికేషన్ మేనేజిమెంట్ సిస్టమ్ యాప్ తదితర విద్యా ఉన్నతికి ఉపయోగపడే యాప్‌లు, వెబ్ సైట్‌ల గురించి వివరించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్స్‌పాల్ డాక్టర్ ఎస్.మాధవి అధ్యక్షత వహించారు. ఐటీ ఓఎస్‌డీ కవిత, సీఈజేపీ డెవలప్పర్ శివరాజ, ఐటీ ఆఫీసర్ శ్రీధర్, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి పెద్దపీట వేస్తున్న ప్రభుత్వం

ఎంపీపీ గద్దే పుష్పరాణి


ప్రథమస్థానం సాధించిన మహారాణిని సత్కరించిన ఎంపీపీ పుష్పరాణి, సర్పంచ్‌లు

గుడివాడరూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేస్తున్నారని ఎంపీపీ గద్దే పుష్పరాణి పేర్కొన్నారు. మండల పరిధిలోని మోటూరు గురుకుల పాఠశాలలో గురువారం నిర్వహించిన జగనన్న ఆణిముత్యాల కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన మొదటి మూడు స్థానాల విద్యార్థుల అభినందన సభలో మాట్లాడారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ పేద విద్యార్థులకు కార్పొరేట్ పాఠశాలల్లో అందే విద్యను ప్రభుత్వ పాఠశాలల్లో సీఎం అందజేస్తున్నారన్నారు. సీఎం జగన్ విద్యాభివృద్ధికి చేస్తున్న కృషిని విద్యార్థులు సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు. పదో తరగతిలో మోటూరు గురుకుల పాఠశాల విద్యార్థినులు ఎ.మహారాణి 600 మార్కులకు గాను 541 మార్కులు సాధించి ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. కె.బి రాణి 600 మార్కులకు 523 మార్కులు సాధించి ద్వితీయస్థానంలో నిలిచిందన్నారు. ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు రూ.15 వేలు, రూ.10 వేలు చొప్పున రాష్ట్ర ప్రభుత్వం అవార్డులను అందజేసి విద్యార్థులను ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. అనంతరం విద్యార్థులను ఘనంగా సత్కరించి సన్మానించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కొరగంటి పద్మ, ప్రిన్సిపాల్ పద్మశ్రీ, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా గంగానమ్మ జాతర

జమీగొల్వేపల్లి(పామర్రు): మండల పరిధి జమీగొల్వేపల్లి గ్రామంలో వేంచేసియున్న శ్రీ గంగానమ్మ తల్లి ఆలయ 6వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం సంబరాలను ఘనంగా నిర్వహించారు. తొలుత అమ్మవారికి 108 జలబిందెలతో జలాభిషేకం నిర్వహించారు. అనంతరం అమ్మవారిని పసుపుకుంకాలతో విశేషంగా అభిషేకించి తదుపరి నూతన వస్త్రాలతో అలంకరించి విశేషంగా పూజలు చేశారు. పెద్దు రమణబాబు వితరణతో పొట్లూరి వెంకటేశ్వరరావుఆధ్వర్యంలో ఈ సంబరాలను నిర్వహించారు. కార్యక్రమంలో వి.రాజేంద్రబాబు, లింగమనేని సూర్యనారాయణ, వి.వెంకటరత్నం, ఏ.అరవిందబాబు, వల్లభనేని వేణుగోపాలరావు, వీమోహన్‌రావు, ఎన్.వెంకటరత్నం, వై.వెంకటేశ్వరరావు, కె.నెహ్రూ, ఎన్.వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పామర్రు: స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో ఈనెల 17వ తేదీ శనివారం విద్యుత్ అంతరాయం కలుగుతుందని ఏఈఈ మోహన్‌కృష్ణారావు గురువారం తెలిపారు. ఆ రోజు ఉదయం 7గంటలనుంచి 10 గంటల వరకు సరఫరా నిలిపివేస్తామన్నారు. విద్యుత్ స్తంభాలు, తీగలకు అంతరాయం కలిగించే చెట్లు తదితరాలను తొలగించేందుకు వీలుగా ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

నీటి సరఫరా వేళల్లో మార్పు

గుడివాడ టౌన్: పట్టణంలో నీటి సరఫరా వేళల్లో మార్పు చేసినట్టు మున్సిపల్ కమిషనర్ వి.మురళీకృష్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం 4.30 గంటల నుంచి 5.30 గంటల వరకు నీటి సరఫరా అవుతుందన్నారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి సహకరించవలసిందిగా ఆయన కోరారు. పట్టణంలో ఇంతకు ముందు రోజూ ఉదయం 6.00 గంటల నుంచి 7.00 గంటల వరకు నీరు సరఫరా అయ్యేదన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహనరెడ్డి పట్టణానికి విచ్చేయుచున్న సందర్భంగా ప్రజలు సభకు వెళ్లాల్సిన నేపథ్యంలో పట్టణ ప్రజల సౌకర్యార్థం నీటి సరఫరా వేళల్లో ఈ మార్పు చేశామన్నారు.

తాగునీటి సమస్యకు త్వరలో పరిష్కారం

జల్‌జీవన్ మిషన్ నిధులు రూ.53.60 లక్షలు మంజూరు


నరసాయిపాలెం తాగునీటి సరఫరాపై చర్చిస్తున్న అధికారులు

కైకలూరు: శతాబ్దాలుగా నరసాయిపాలెం గ్రామ ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యకు త్వరలో పరిష్కారం లభించనుంది. నరసాయిపాలెంలో నూతన రక్షిత నీటి పథకం ఏర్పాటుపై దొడ్డిపట్ల సచివాలయంలో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, గ్రామ నీటి సరఫరా అభివృద్ధి సంఘం, పంచాయతీ కార్యదర్శులతో గురువారం సమీక్షించారు. గ్రామానికి జల్‌జీవన్ మిషన్ ద్వారా రూ.53.60 లక్షలు మంజూరయ్యాయి. నెల రోజుల్లో టెండర్లు పూర్తి చేసి పనులు ప్రారంభించే విధంగా చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. గ్రామంలో 100 కుటుంబాలు, 800 మంది జనాభా నివసిస్తున్నట్టు చెప్పారు. నీటి అవసరాలకు నాలుగు ఎకరాల తాగునీటి చెరువు ఉందని, రక్షిత మంచినీటి పథకం ట్యాంకు లేకపోవడంతో ప్రజలు నీటిని కొనుగోలు చేస్తున్నారని తెలిపారు. ఈ విషయాన్ని స్పందన కార్యక్రమంలో గ్రామస్తులు కలెక్టరుకు వినతిపత్రాలు అందించారు. ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) కృషితో టెండర్ల ప్రక్రియను పూర్తి చేసి పనులు చేపట్టనున్నారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ శాస్త్రి, ఇన్‌చార్జి ఈవోపీఆర్డీ రవికిరణ్, దొడ్డిపట్ల పంచాయతీ కార్యదర్శి శ్రీమన్నారాయణ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నాగబాబు, గ్రామ నీటి సరఫరా అభివృద్ధి సంఘ సభ్యులు, సచివాలయాల సిబ్బంది హాజరయ్యారు.

నేడు కొండలమ్మకు లక్ష మల్లెలతో అర్చన



గుడ్లవల్లేరు: మండలంలోని వేమవరం శ్రీ కొండలమ్మ అమ్మవారికి జ్యేష్ఠ మాసం సందర్భంగా లక్ష మల్లెల అర్చనను శుక్రవారం వేద పండితులు నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని ఆలయ చైర్మన్ శేషం గోపి, ఈఓ సురేష్ గురువారం తెలిపారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించవలసిందిగా కోరారు.

కూలిన ఎల్ఐసీ కేంద్ర భవనం ప్రహరీ


కూలిన ఎల్ఐసీ కేంద్ర భవనం ప్రహరీ

కైకలూరు: స్థానిక ఎల్ఐసీ కేంద్ర భవనం ప్రహరీ బుధవారం అర్ధరాత్రి కూలింది. దాదాపు 30 సంవత్సరాల క్రితం కైకలూరు ప్రభుత్వ పాఠశాల సమీపంలో భవనాన్ని నిర్మించారు. దీనికి సమీపంలో పాత రైసుమిల్లు మూసివేసి ఉంది. ప్రతి రోజూ కార్యాయానికి వివిధ పనులపై వచ్చే పాలసీదారులు, సిబ్బంది రైసుమిల్లు సమీపంలో వాహనాలను నిలుపుతారు. పగటి సమయంలో గోడ కూలితే ప్రాణనష్టం జరిగేది. గ్రౌండ్ ఫ్లోర్‌లో దుకాణాలు, రెండో అంతస్తులో ఎల్ఐసీ కార్యాలయం, చివరి అంతస్తులో ప్రైవేటు కాలేజీ కొనసాగుతోంది. నూతన భవనంలోకి ఎల్ఐసీ కార్యాలయాన్ని మార్చాలని సిబ్బంది, పాలసీదారులు కోరారు.

బాధిత కుటుంబానికి సాయం



కైకలూరు: మండలంలోని పల్లెవాడకు చెందిన చిట్టిబొమ్మల నాగేశ్వరరావు ఇటీవల మృతి చెందాడు. గ్రామంలోని సొసైటీలో నాగేశ్వరరావు సభ్యుడిగా ఉన్నాడు. దీంతో గురువారం స్థానిక పీఏసీఎస్ అధ్యక్షుడు గంగుల అశోక్ మట్టి ఖర్చుల నిమిత్తం మంజూరైన రూ.10 వేలు నాగేశ్వరరావు కుటుంబ సభ్యుడికి అందించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ దుట్టా మోహన్, కమిటీ సభ్యులు మత్తి సామ్రాజ్యలక్ష్మి, యాళ్ల ప్రకాష్‌రావు, సీతంటి జి.నాగేశ్వరరావు, ఎస్ఏ జోషిబాబు, గ్రామస్తులు పాల్గొన్నారు.

























దేవదాయ ధర్మదాయ శాఖ

శ్రీ గాంధీ సేవాశ్రమం, మండవల్లి, శ్రీ రాజగోపాల స్వామి వారి దేవస్థానం, అల్లినగరం

చేపల చెరువు చేపల పెంపకం లైసెన్స్ నిమిత్తం టెండర్ (కం) బహిరంగ వేలం ప్రకటన

ఏలూరు జిల్లా, మండవల్లి మండలం, మండవల్లి, అల్లినగరం ఈ క్రిందిపేర్కొన్న దేవాలయములకు చెందిన సంపూర్ణ స్వాధీన హక్కు భుక్తములు కలిగియున్న ఈ క్రింది గ్రామాలలో గల చేపల చెరువుల పెంపకం లైసెన్స్ నిమిత్తం 3 సంవత్సరముల కాలపరిమితికి అనగా 2023-24 నుండి 2025-2026 వరకు ప్రభుత్వ G.O.M.S.No.426 Dt.19-11-2015 ఈ దిగువ షెడ్యూలు దాఖలా టెండర్ (కం) బహిరంగ వేలము పాట నిర్వహించబడును.

వ. నెం.	దేవాలయము పేరు గ్రామము, మండలం	భూములున్న గ్రామము	భూ స్థితి	రీ సర్వే నెం.	విస్తీర్ణము య. సెం.	ధరావత్తు రూ.	కౌలు కాలపరిమితి	బహిరంగవేలం జరుగు ప్రదేశం, సమయం, తేదీ
1.	శ్రీ గాంధీసేవాశ్రమం, మండవల్లి గ్రామం, మండవల్లి మండలం	మండవల్లి గ్రామం	చెరువు	228/2 228/3 228/4 228/5 మొత్తం	1-28 0-62 0-30 0-39 2-59	20,000/-	2023-24 టు 2025-26	ది. 28-06-2023వ తేదీ బుధవారం ఉదయం గం॥ 10-00లకు మండవల్లి శ్రీ గాంధీ సేవాశ్రమం వద్ద
2	శ్రీ రాజగోపాల స్వామివారి దేవస్థానం, అల్లినగరం గ్రామం, మండవల్లి మండలం	గున్నన పూడి, మండవల్లి మండలం	చెరువు	9	02-36		2023-24 టు 2025-26	ది. 28-06-2023వ తేదీ బుధవారం ఉదయం గం॥ 11-00లకు పసలపూడి పంచాయితీ కార్యాలయం వద్ద

టెండర్ (కం) బహిరంగ వేలం పాట షరతులు పాట కాలము నందు తెలుపబడును. మిగతా వివరములకు కలిదిండి గ్రూపు దేవాలయముల కార్యాలయము నందు పనివేళలలో తెలుసుకొనగలరు లేదా కార్యనిర్వహణాధికారి వారి సెల్ నెం. 98666 31608 నందు సంప్రదించగలరు.

మండవల్లి
ది. 10-06-2023

సం/- శింగవరపు శ్రీనివాసరావు, M.A.
కార్యనిర్వహణాధికారి, సెల్ : 98666 31608

దేవదాయ ధర్మదాయ శాఖ

శ్రీ సీతారామస్వామి వారి దేవస్థానం, తాడినాడ

చేపల చెరువు చేపల పెంపకం లైసెన్స్ నిమిత్తం టెండర్ (కం) బహిరంగ వేలం ప్రకటన

ఏలూరు జిల్లా, కలిదిండి మండలం, తాడినాడ గ్రామంలో వేంచేసియున్న శ్రీ సీతారామ స్వామి వారి దేవస్థానంనకు తాడినాడ గ్రామంలో రీ.సర్వే నెం. 593/3, 594 మరియు 625లో య. 31.44 ట్లు, శ్రీ స్వామి వారికి చెందిన సంపూర్ణ హక్కు హక్కుములు కలిగియున్న ఈ క్రింది పేర్కొన్న విధంగా చేపల చెరువు చేపల పెంపకం లైసెన్స్ నిమిత్తం ప్రభుత్వ M.A.G.O.Ms.No.425 Dt.9-941-0 ప్రకారం టెండర్ (కం) బహిరంగ వేలం నిర్వహించబడును.

వ. నెం.	భూములున్న గ్రామము	భూ స్థితి	రీ. సర్వే నెం.	విస్తీర్ణము య. సెం	ధరావత్తు రూ.	కౌలు కాలపరిమితి	బహిరంగ వేలము జరుగు ప్రదేశం, సమయం, తేదీ
1.	కలిదిండి మండలం, తాడినాడ గ్రామము	చెరువు	593/3 594	1-72 2-28 4-00	25,000/-	2023-24 టు 2025-2026 3 సం॥ముల కాలపరిమితి	26-06-2023వ తేదీ సోమవారం ఉదయం గం॥ 10-00 లకు తాడినాడ శ్రీ స్వామి వారి దేవస్థానం వద్ద
2.		చెరువు	594	4-00	25,000/-		
3.		చెరువు	594 625	2-52 1-48 4-00	25,000/-		
4.		చెరువు	625	4-00	25,000/-		
5.		చెరువు	625	6-00	25,000/-		
6.		చెరువు	625	3-00	25,000/-		
7.		చెరువు	625	3-00	25,000/-		
8.		చెరువు	625	3-44	25,000/-		
			మొత్తం	31-44			

టెండర్ (కం) బహిరంగ వేలం పాట షరతులు పాట కాలము నందు తెలుపబడును. మిగతా వివరములకు కలిదిండి గ్రూపు దేవాలయముల కార్యాలయము నందు పనివేళలలో తెలుసుకొనగలరు లేదా కార్యనిర్వహణాధికారి వారి సెల్ నెం. 98666 31608 నందు సంప్రదించగలరు.

అల్లూరి శివాజీ,
అల్లూరి అచ్యుతరామరాజు
వ్యవస్థాపక ధర్మకర్తలు

తాడినాడ
ది. 10-06-2023

సం/- శింగవరపు శ్రీనివాసరావు, G.S.
కార్యనిర్వహణాధికారి
సెల్ : 98666 31608

దేవదాయ ధర్మదాయ శాఖ

శ్రీ కోదండరామస్వామి వారి దేవస్థానం, వెంకటాపురం

చేపల చెరువుల చేపల పెంపకం/మెరక భూముల నగదు శిస్తు లైసెన్స్ నిమిత్తం టెండర్ (కం) బహిరంగ వేలం ప్రకటన

ఏలూరు జిల్లా, కలిదిండి మండలం, వెంకటాపురం గ్రామంలో వేంచేసియున్న శ్రీ కోదండరామ స్వామి వారి దేవస్థానంనకు వెంకటాపురం గ్రామంలో ఉన్న చేపల చెరువులు మరియు గోపాలపురం పంచాయితీ ఏరియాలో సానారుద్రవరం శివిన్యా గ్రామంలో కలిగియున్న మెరకభూములు ఈ క్రింది పేర్కొన్న విధంగా చేపల చెరువు చేపల పెంపకం లైసెన్స్ నిమిత్తం ప్రభుత్వ G.O.M.S.No.426 Dt.19-11-2015 ప్రకారం టెండర్ (కం) బహిరంగ వేలం నిర్వహించబడును.

వ. నెం.	భూములున్న గ్రామము	భూ స్థితి	రీ. సర్వే నెం.	విస్తీర్ణము య. సెం	ధరావత్తు రూ.	కౌలు కాలపరిమితి	బహిరంగ వేలము జరుగు ప్రదేశం, సమయం, తేదీ
1.	వెంకటాపురం	చెరువు	87-బి1ఎ	1-68	15,000/-	2023-24 టు 2025-2026 3 సం॥ముల కాలపరిమితి	26-06-2023వ తేదీ సోమవారం మధ్యాహ్నం గం॥ 12-00 లకు వెంకటాపురం శ్రీ స్వామివారి దేవస్థానం వద్ద
2.	వెంకటాపురం	చెరువు	87బి-3	6-36	15,000/-		
3.	వెంకటాపురం	చెరువు	87-బి1సి	4-75	15,000/-		
4.	వెంకటాపురం	చెరువు	87-బి1సి 87-బి2ఎ	2-61 2-14 4-75	15,000/-		
5.	వెంకటాపురం	చెరువు	10-2 10-3	1-74 0-82 2-56	15,000/-		
6.	వెంకటాపురం	చెరువు	83	3-68	15,000/-		
7.	వెంకటాపురం	చెరువు	87-ఎ	0-31	1,000/-		
8.	వెంకటాపురం	మెరక పచ్చగడ్డి	130-5	0-92	1,000/-		
9.	వెంకటాపురం	మెరక పచ్చగడ్డి	138-1	0-73	1,000/-		
10.	గోపాలపురం	మెరక పచ్చగడ్డి	37-ఎ 37-సి	2-60 4-90 7-50	1,000/-		
			మొత్తం	33-24			

టెండర్ (కం) బహిరంగ వేలం పాట షరతులు పాట కాలము నందు తెలుపబడును. మిగతా వివరములకు కలిదిండి గ్రూపు దేవాలయముల కార్యాలయము నందు పనివేళలలో తెలుసుకొనగలరు లేదా కార్యనిర్వహణాధికారి వారి సెల్ నెం. 98666 31608 నందు సంప్రదించగలరు.

వెంకటాపురం
ది. 10-06-2023

సం/- శింగవరపు శ్రీనివాసరావు, M.A.
కార్యనిర్వహణాధికారి, సెల్ : 98666 31608